క్లుప్తంగా

తబలా విద్వాంసుడు చినబాపిరెడ్డికి సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం సత్యహరిశ్చంద్ర చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం ఇంటికి దీపం ఇల్లాలే చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ తబల విద్వాంసుడు దుండి చినబాపిరెడ్డిని ఘనంగా సన్మానించారు. మహ్మద్ జబివుల్ల, బిట్రా రాంబాబు, మస్తాన్, షరీఫ్, జిలానీ, రబ్బనీ, ఖదీర్, అబ్దుల్ రఫీ, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి అవసరం

తెనాలి ఆర్డీఓ రాఘవరావు



తెనాలిఅర్బన్: క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని తెనాలి ఆర్డీఓ టి.రాఘవరావు సూచించారు. బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన అంతర్‌విభాగ ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వలన మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందన్నారు. నేటి యువత విద్యకు ప్రాధాన్యత ఇస్తూ పూర్తిగా క్రీడలను విస్మరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పాఠశాలలో క్రీడలను ప్రతి రోజు నిర్వహించే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాము, హృదయరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తే చర్యలు

ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల



తెనాలిఅర్బన్: 120 మైక్రాన్‌ల తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు, వస్తువులను విక్రయిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల హెచ్చరించారు. ప్లాస్టిక్ వస్తువులను ప్రభుత్వం నిషేధించిన నేపథ్యంలో పట్టణంలోని వ్యాపారులకు మంగళవారం ఆమె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూట్, క్లాత్ బ్యాగ్‌లను అందరూ ఉపయోగించాలని సూచించారు. వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, సిబ్బంది ఉన్నారు.

గోశాలలో గో పూజ



తెనాలిటౌన్: ఆంజనేయం ధ్యాన యోగ మండలి ఆధ్వర్యంలో రామలింగేశ్వపేటలోని తోటవారి వీధిలో గోశాలలో గోవుల దినోత్సవం నిర్వహించారు. గోశాల నిర్వాహకులు రామకృష్ణ పౌండరీక సోమయాజులు, యోగ మండలి వ్యవస్థాపకుడు కిషోర్ గురూజీ గోవులను పూజించారు. గోవులకు దాణా అందజేశారు. గోవుల విశిష్టతను సోమయాజులు వివరించారు. యోగ మండలి సభ్యులు ముంతా శ్రీనివాసరావు, తాడికొండ శ్రీనివాసరావు, కొర్రపాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు విరాళం..

రూరల్ మండలం నందివెలుగులోని మహర్షి దయానంద ఆశ్రమంలోని గోశాల నిర్వాహణకు వాసవీ క్లబ్ తెనాలి సభ్యులు మంగళవారం రూ.రెండు వేల చెక్కును విరాళంగా అందజేశారు. గోవులకు పశుగ్రాసం, దాణా, బెల్లం,అరటి పండ్లు అందజేశారు. క్లబ్ సభ్యులు జయంత్‌కుమార్, బాలగణేష్, రమేష్ పాల్గొన్నారు.

● మీ త్యాగాలు మరువలేనివి



అమర జవాన్ల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్, కౌన్సిలర్

తెనాలిఅర్బన్: వైఎస్సార్ సీపీ నాయకులు కుర్రా శ్రీనివాసరావు, షేక్ మీరావలి సంయుక్త ఆధ్వర్యంలో పుల్వామాలో 2019లో జరిగిన తీవ్రవాదుల దాడిలో అమరులైన వీరజవాన్‌ల చిత్రపటాలకు రైల్వేస్టేషన్ రోడ్డులోని శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన జవాన్లను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపై ఉందని చెప్పారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, కుర్రా సుజాత, మొగల్ అహ్మద్ బేగ్, యాతాటి అనిల్, షేక్ దుబాయ్ బాబు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● అయ్యో.. ఎలా జరిగిందమ్మా..!

'అగ్ని' బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

తెనాలిఅర్బన్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నాజర్‌పేటలోని కొణతాల రమాదేవి నివాసం మంగళవారం దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అక్కడకు వెళ్లి బాధితులను పరామర్శించారు. అలాగే బాధితులకు కొంత ఆర్థిక సాయం చేశారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయాన్ని త్వరగా అందించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, అక్కిదాసు కిరణ్, తదితరులు ఉన్నారు.



దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

● క్యాన్సర్‌ను సై'కిల్' చేయాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ దిలీప్, ఆరోగ్య సిబ్బంది

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గ్రామాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి నేషనల్ హెల్త్ మిషన్, ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. హెల్త్ అండ్ వెలెనెస్ సెంటర్లలో ఆజాద్ కా అమృత్ మహోత్సవంలో భాగంగా సైకిల్‌పై క్యాన్సర్, యోగా, డీ వార్మింగ్ లపై ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ సుబ్బారావు తెలిపారు. ర్యాలీలో డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ దిలీప్, హెచ్ఈవో నాగరాజు, సూపర్‌వైజర్లు జి.శ్రీనివాసరావు, లక్ష్మీప్రసన్న, సుధారాణి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గడప గడపలో సమస్యల పరిష్కారానికి కృషి



వృద్ధురాలి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలిఅర్బన్: గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహణలో తెనాలి నియోజకవర్గం రాష్ట్రంలోని టాప్-14లో ఉందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 31వ వార్డు కాల్వ కట్ట రోడ్డు నుంచి మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ 31వ వార్డు కౌన్సిలర్ గోగినేని మానసరెడ్డి, నాయకుడు సతీష్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉందని పరిష్కరించాలని ఆ ప్రాంత వాసులు కోరారు. నూతన డ్రైన్ల ఏర్పాటుకు నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ గడప గడపకు కార్యక్రమం విజయవంతంగా జరగడానికి సహకరిస్తున్న అధికారులు, నాయకులు, ప్రజలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు. 30వ వార్డులో 1091 ఇళ్లు ఉన్నాయని, వాటిలో 3,802 మంది ప్రజలు నివసిస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ చేయూత 171 మందికి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన 108మందికి, అమ్మ ఒడి 188, వైఎస్సార్ బీమా 899, పింఛన్ కానుక 352, ఇళ్ల స్థలాలు 478 మందికి ఇచ్చినట్లు తెలిపారు. వార్డులో రూ.15.33కోట్ల సంక్షేమాన్ని ఇప్పటి వరకు అందించినట్లు తెలిపారు. అలాగే వార్డు పరిధిలోని కేఎస్ఎం స్కూల్ అభివృద్ధికి రూ.70లక్షలు డ్రెయిన్ పూడికతీత పనులకు రూ.16లక్షలు నిధులు వెచ్చించినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి సంక్షేమాన్ని ఇచ్చామని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో వార్డులో జెండా చెట్టు రోడ్డు పల్లంగా ఉందని, దానికి మెరకవేసి రోడ్డు నిర్మిస్తామని గతంలో హామీ ఇచ్చామని గుర్తు చేశారు. అలాగే డ్రెయిన్ సమస్యను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ రెండింటిని రెండు నెలలో పూర్తి చేస్తామని ప్రకటించారు. అలాగే వార్డు ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, పేరం సంజీవరెడ్డి, షేక్ ఇస్మాయేల్, కొమ్మురబత్తుని జయపాల్, కఠారి రత్నకుమారి, కుర్రా సుజాత, ఆవుల కోటయ్య, కొర్ర యశోద, తాడిబోయిన రామయ్య, కో-ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, 31వ వార్డు నాయకులు కృష్ణ, రావి శ్రీనివాసరావు, జీఎంఆర్ గద్దల రమేష్, డి.బాబు, ప్రతాప్, జ్యోత్స్న, కాలం కోటేశ్వరరావు, ఆశీ, నబీ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే హక్కులు సాధించుకోవచ్చు

సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ చెంగయ్య



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్ ఎస్ చెంగయ్య

మంగళగిరి: కార్మికుల ఐక్య పోరాటాలతోనే హక్కులు సాధించుకోవచ్చని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ చెంగయ్య అన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. చెంగయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏరియా మహాసభ మార్చి 15వ తేదీన నిర్వహించాలని విస్తృత సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు కుటుంబాలు గడవక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భవన నిర్మాణ రంగంలో సంక్షేమ చట్టం ఉన్నా దానికి సంబంధించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వమే తీసుకుని కార్మికులకు మొండిచెయ్యి చూపిస్తుందని విమర్శించారు. ఇటువంటి పరిస్థితుల్లో కార్మికులు ఐక్యంగా పోరాడి తమ హక్కులు సాధించుకోవాలన్నారు. సీఐటీయూ నాయకులు జేవీ రాఘవులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కరోనా పరిస్థితులు, రాష్ట్ర ప్రభుత్వ ఇసుక విధానం, మెటీరియల్స్ ధరలు పెరగడం వల్ల పనులు ఉండటం లేదన్నారు. రాజధానుల ప్రకటన తర్వాత ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువైపోతుందన్నారు. భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరువీధుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి ఎస్‌కే జానీబాషా, వి పూర్ణయ్య, సీహెచ్ సత్యనారాయణ, శివారెడ్డి, ఎస్ వెంకయ్య, సురేష్, శ్రీనివాసరావు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి వై కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్లతో కంటి సమస్యలు అధికం

కేఎల్‌యూలో ఉచిత కంటి వైద్య శిబిరం



కంటిపరీక్షలు నిర్వహిస్తున్న కామాక్షి ఐ కేర్ వైద్యులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ యూనివర్సిటీలో మంగళవారం హెల్ప్ ఫౌండేషన్ (సత్తెనపల్లి), కామాక్షి ఐ కేర్ (చెరుకుపల్లి) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని డీన్ డాక్టర్ సీహెచ్ హనుమంతరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువగా ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్‌లకు అలవాటు పడడం వలన కంటి సమస్యలు అధికంగా వస్తున్నాయని అన్నారు. కామాక్షి ఐ కేర్ వైద్యులు వాసుదేవరావు మాట్లాడుతూ కంటి చూపు మందగించడానికి కారణాలు, జీవితాంతం కంటిచూపు మెరుగ్గా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. వైద్యులను సంప్రదించకుండా ఎలాంటి మందులు వాడకూడదని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, విశ్వవిద్యాలయ అసోసియేట్ డీన్ డాక్టర్ రూతు రమ్య, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, యూనివర్సిటీ యూత్ రెడ్‌క్రాస్ డాక్టర్ శివారెడ్డి, హాస్పిటల్ సిబ్బంది వనిత, సదాశివరావు, బాజ్జి తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో కార్మికుడు మృతి

మేడికొండూరు: విధి నిర్వహణలో ఉండగా అనారోగ్యానికి గురైన ఓ కార్మికుడు ప్రాణాలు కోల్పోయిన సంఘటన మండలంలోని పేరేచర్లలో ఒక స్టోన్ క్రషర్‌లో మంగళవారం జరిగింది. పేరేచర్ల సమీపంలోని విజయ కాటన్ కాలనీకి చెందిన పి.సుబ్బారావు(42) పేరేచర్లలోని ఒక స్టోన్ క్రషర్‌లో పనిచేస్తుంటాడు. రోజు మాదిరిగానే మంగళవారం విధులకు హాజరయ్యారు. ఒక్కసారిగా కళ్లు తిరిగి కిందపడిపోయాడు. అతనిని తోటి కార్మికులు గుంటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

సాంకేతికతను అందిపుచ్చుకోండి



వర్క్‌షాపులో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

తెనాలిఅర్బన్: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం వస్తున్న మార్పులను ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ సూచించారు. ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనే అంశంపై మంగళవారం వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచుకునేందుకు దోహదపడతాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామారావు మాట్లాడుతూ భవిష్యత్‌లో సాంకేతిక విద్య మరింత విస్తరించనున్నదని చెప్పారు. సమావేశంలో అధ్యాపకులు డాక్టర్ కె.కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మికుడు అదృశ్యం

తెనాలి రూరల్: కార్మికుడు అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ బాలాజీరావుపేటకు చెందిన పసుపులేటి సుధాకర్ కూలి పనులకు వెళుతుంటాడు. నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. భార్య నాగేశ్వరి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ ఎస్ఐ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు.

తమ్ముడిపై అక్క దాడి

తెనాలి రూరల్: మద్యం సేవించి వచ్చి వేధిస్తున్న తమ్ముడిపై అక్క రాయితో దాడి చేసి గాయపర్చిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్‌కు చెందిన 30 ఏళ్ల ఆదిత్య సోమవారం రాత్రి మద్యం తాగి వచ్చి అతని అక్క ఆషాతో ఘర్షణ పడి వేధించసాగాడు. దీంతో ఆమె రాయితో అతనిపై దాడి చేయగా గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు మంగళవారం నమోదు చేసినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి

ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడి వీఆర్‌ఏ టి.గంగయ్య(58)గుండెపోటుతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ పద్మనాభుడు, రెవెన్యూ సిబ్బంది గంగయ్య కుటుంబసభ్యులను మంగళవారం పరామర్శించి ప్రభుత్వం తరుపున మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15వేల నగదు అందజేశారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో ఆదివారం రాత్రి మైనర్ బాలిక ఎస్తేరురాణిని అతి కిరాతకంగా హత్యచేసిన కుక్కల రాజును కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కన్వీనర్ నల్లపు కిషోర్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాడేపల్లి ప్రాంతంలో రోజురోజుకీ మందుబాబుల ఆగడాలు మితిమీరుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు.

ఘన జీవామృతంతో అధిక మేలు

ఫిరంగిపురం: ఘనజీవామృతంతో పంటకు అధికంగా మేలు చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయం స్టేట్ రీసెర్చ్ కోఆర్డినేటర్ రచిత్ తివారీ అన్నారు. మండలంలోని 113తాళ్లూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంతో పంటను పండించిన రైతుల పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం పంటలు వేసిన రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి అనుభవాలు అడిగితెలుసుకున్నారు. పంటకు రసాయనిక ఎరువులు వాడకం లేదా ప్రకృతి వ్యవసాయంలో వాడే కషాయాల వాడకంలో ఉన్న తేడాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా ప్రకృతి వ్యవసాయం డీఆర్పీ ఎంటీ.కుమార్, ఎస్‌డీపీ అన్నామణి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు దామోదరం సంజీవయ్య

మాజీ ముఖ్యమంత్రి సంజీవయ్య చిత్రపటానికి దళిత సంఘాల నేతల నివాళి



సంజీవయ్య చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

తెనాలిటౌన్: ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 102వ జయంతి వేడుకలను రూరల్ మండలం మల్లెపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంజీవయ్య చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలి దళిత ముఖ్యమంత్రిగా, పేదలపక్షపాతిగా సంజీవయ్య పేరుగాంచారని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచి పినపాటి సురేష్‌బాబు, దళిత లిబరేషన్ ఆర్గనైజేష్ నాయకులు గుంటి సురేష్‌బాబు, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కంచర్ల చంద్రోఖర్, రెడ్స్ డైరెక్టర్ తురిమెళ్ల మోహనరావు, అంబేడ్కర్ సంఘాల నాయకులు శామేలు, బడుగు రత్నకుమార్, గుమ్మడి ప్రకాశరావు, సంఖే ఏడుకొండలు, డాక్టర్ గుడివాడ హనుమంతరావు, న్యాయవాది కంచర్ల కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో కమిషనర్ తనిఖీలు



18 వార్డు సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జశ్వంతరావు

తెనాలిటౌన్: పట్టణంలోని పలు వార్డులలోని సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు మంగళవారం సందర్శించారు. సచివాలయాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారో, హాజరవుతున్నారో అనే విషయాలను తెలుసుకునేందుకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించే విషయంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల్లో నిర్వహిస్తున్న రికార్డు రిజిష్టర్లను పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ఏర్పాటు చేయవాల్సిన ఫ్లెక్సీ బ్యానర్లు, బోర్డులను పరిశీలించారు. సచివాలయంకు వచ్చే ప్రజలతో సిబ్బంది స్నేహపూర్వకంగా, మర్యాదగా ప్రవర్తించాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో మేనేజర్, సచివాలయ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్య సేవలు ఎనలేనివి

వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు



సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ప్రజల మనసును గెలిచిన ప్రజా నాయకుడని, ఆయన అందించిన సేవలు ఎనలేనివని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు కొనియాడారు. నగరంలోని ఆటోనగర్‌లో ఉన్న ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో మంగళవారం మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 102వ జయంతి ఉత్సవం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ నేతలు పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మునగాల మాట్లాడుతూ సంజీవయ్య జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉద్యోగ జీవితం నుంచి మొదలైన ఆయన ప్రస్థానం రాజకీయ రంగంలో ఓ ఘనుడిగా ఇనుమడించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రి వర్గాల్లో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆనాడు ఉన్న క్లిష్టమైన రాజకీయ పరిస్థితులను దాటి ఓ బలమైన వర్గాన్ని ఎదుర్కొని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా ఎదగటం సాధారణ విషయం కాదన్నారు. దళితజాతికి దామోదరం సంజీవయ్య ఒక వెలుగు జ్యోతి అని, ఆయన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంకా బాలాజీగుప్తా, ఎండీ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ మాలదాసు, మాల దాసరి, మిత్తల అయ్యావార్ల హక్కుల సాధన పోరాట సమితి ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇందుపల్లి రామారావు, లేళ్ల సురేష్, కూరపాటి సుబ్బారావు, గోలి సాంబశివరావు, కాకర్లమూడి దుర్గారావు, గాజుల రామమోహనరావు తదితరులు పాల్గొన్నారు.